క్లుప్తంగా

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఎల్లమ్మ తల్లి

కుల్కచర్ల: మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో వనంల ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గౌడ సంఘం నాయకులు, గ్రామస్తులు వైభవంగా ప్రారంభించారు. బుధవారం జలాదివాసం, గురువారం ధాన్యాదివాసం, హోమం, అమ్మవారి విగ్రహ ఊరేగింపు 18వ తేదీ 3వరోజు విగ్రహ ప్రతిష్ఠాపన, హోమం, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపన, సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

ఎంపీడీఓ రాములు


ఇందిరమ్మ ఇంటికి ముగ్గు వేయిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగవరం మోడల్ గ్రామంలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుడితో కలిసి ఇంటికి ముగ్గు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు ఇండ్లకు మార్కింగ్ చేసినట్లు చెప్పారు. మంజూరు పత్రాలు అందుకున్న ప్రతి లబ్ధిదారుడు పనులు మొదలుపెట్టాలని ఆయన సూచించారు. బేస్మెంట్ పూర్తి చేసిన వెంటనే రూ. లక్ష లబ్ధిదారుడి ఖాతాలో జమ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శేఖర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఈర్లపల్లి మహిళా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మహిళలు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో మహిళా సంఘం గ్రామ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈర్లపల్లి, నాన్య నాయక్ తండా, సంట్ర కుంట తండాలకు సంబంధించిన 27 సంఘాలకు చెందిన ముఖ్య సభ్యులు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరిత, కార్యదర్శిగా పద్మమ్మ, కోశాధికారిగా విజి బాయిలను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సరిత మాట్లాడుతూ మహిళా సంఘాలలో ఎలాంటి అవకతవకలు లేకుండా, ఇబ్బందులు కలగకుండా సంఘాలకోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సీసీ రామచంద్రయ్య, బీవోఏ మల్కప్ప, గ్రామస్తుడు రవి నాయక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి


యావపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరుణ్ కుమార్

నవాబుపేట: ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నవాబుపేట ఎస్ఐ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని యావపూర్‌లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు. అనుమానిత వ్యక్తులు, గుర్తుతెలియని దుండగులను గుర్తించి పట్టుకోవడానికి వీలవుతుందన్నారు. నేరాలను అదుపు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టయ్య, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా!

- ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు
- ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో భారీగా తవ్వకాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


ఊటుపల్లి ప్రభుత్వ భూముల్లో మట్టి కోసం తవ్వడంతో ఏర్పడ్డ గోతులు

దోమ: ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు వినియోగిస్తూ కొందరు అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల నుంచి యథేచ్ఛగా మట్టి దందా కొనసాగిస్తున్నారు. వెంచర్లు, గృహ నిర్మాణాలు, రోడ్లకోసం మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు వ్యాపారులకు మెండుగా ఉండడంతోనే మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు లేకుండానే..

మట్టి తవ్వకాలు చేపట్టాలంటే అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ మండలంలో ఎక్కడ కూడా అనుమతులు లేకుండానే కాంట్రాక్టర్లు, వ్యాపారులు రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తోడేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి రూ. లక్షల్లో గండి కొడుతున్నారు. మండల పరిధిలోని లింగన్‌పల్లి సమీపంలోని సర్వే నంబర్ 54లో చెరువు శిఖం భూమి ఉంది. ఆ చెరువు నుంచి తవ్వి ఓ కాంట్రాక్టర్ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఇరిగేషన్ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వగా వారు అక్కడ మట్టి తవ్వకాలు నిలిపేసినట్లు తెలిసింది. మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించినట్లు సమాచారం. అదే కాంట్రాక్టర్ అక్కడి నుంచి దిర్సంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 173లో ప్రభుత్వ భూమి నుంచి మళ్లీ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయం సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా ఎవరు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.


చెరువు శిఖం భూమిలో నుంచి టిప్పర్లో తరలిస్తున్న మట్టి

రోడ్లు ధ్వంసం..

ఊటుపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 93లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే అట్టి ప్రభుత్వ భూమిలో రెండు నెలల నుంచి అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యాపారులు వారి టిప్పర్లతో రాత్రిల్లు ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇద్దరు వ్యాపారులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే అండదండలతో మట్టి దందా జోరుగా కొనసాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్లు ధ్వంసం అవ్వడమే కాకుండా సమీప గ్రామాల ప్రజలు వాహనాల శబ్దానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా మైనింగ్ ఏడీ అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా మట్టి తవ్వితే చర్యలు తప్పవు. అలాగే ప్రభుత్వ భూముల నుంచి రైతులు మట్టిని విక్రయిస్తే అట్టి భూములను పీఓటీ కింద రైతులను నుంచి తీసుకుంటాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

శిథిల భవనాలను కూల్చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్


విద్యాశాఖ అధికారితో ఫోన్లో మాట్లాడుతున్న రాజశేఖర్

ధారూరు: శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాలను కూల్చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి ఆయన మున్నూరుసోమారం ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల గదిలో టీచర్, విద్యార్థులున్నారని, అదృష్టవశాత్తు బాలికపై పెచ్చులే పడ్డాయని, లేకుంటే చాలమందికి గాయాలయ్యేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాత భవనాలకు రంగులు వేయిస్తుందని, ఎప్పటికైనా పాత భవనాలతో ప్రమాదకరమేనన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త భవనాలను నిర్మించాలన్నారు. పాలకులు విద్యా వవస్థపై ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. అనంతరం శిథిలావస్థకు చేరిన భవనాల గురించి ఆయన విద్యాశాఖ అధికారులతో మాట్లాడారన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత


సిరిగిరిపేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పేర్కొన్నారు. తాండూరు మండలంలోని సిరిగిరిపేట్, రాంపూర్, రాంపూర్‌మీదితండాలో జై భీం, జై బాపు, జై సంవిధాన్‌లో భాగంగా గ్రామస్తులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణ నినాదం కాదని, అందరి బాధ్యత అని చాటి చెప్పడానికే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, నాయకులు పురుషోత్తంరెడ్డి, జర్నప్ప, జగదీశ్, మల్లప్ప, చరణ్ చౌహాన్, హర్షవర్ధన్‌రెడ్డి, మోహన్, బాధ్యానాయక్, తులసి, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుపై కేంద్ర వ్యవసాయ కమిటీ సర్వే


పంటలను పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

పరిగి: రబీ సాగుపై కేంద్ర వ్యవసాయ కమిటీ బృందం సర్వే చేపట్టింది. రైతుల పంటల స్థితిగతులపై ఆరా తీశారు. బుధవారం మండల పరిధిలోని రాపోల్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. రైతులు ఏఏ పంటలను సాగు చేశారు. సాగు చేసిన పంటల వివరాలు, అవి ఏ స్థితిలో ఉన్నాయోనని పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. రైతుల దగ్గరకు వెళ్లి పూర్తి సమాచారాన్ని సేకరించారు. రైతుల నుంచి సేకరించిన సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందిస్తే వ్యవసాయ అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఎప్పటికప్పుడు బలోపేతం చేసేందుకు కేంద్రం గ్రామ స్థాయిలో ఉండే సమస్యలను సేకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు ఫయాజ్, గ్రామ రైతులు నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


బంట్వారం: కోట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి


దోమ: ఐనాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పండ్లు అందజేస్తున్న జగణమ్మ తదితరులు

యాలాల: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సంగెంకుర్దు అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, కవిత పేర్కొన్నారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆకు కూరల్లో ఎక్కువగా విటమిన్లు ఉంటాయని, ప్రతి రోజు వాటిని ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఈ సందర్భంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం చిరుధాన్యాలను ఏర్పాటు చేసి ప్రదర్శించారు.

బిడ్డకు తల్లి పాలే తాగించాలి

బంట్వారం: పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు తల్లి పాలే తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 3లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టాక రెండేళ్ల లోపే బరువు, ఎత్తు వేగంగా పెరుగుతాయన్నారు. బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల పాటు తల్లి పాలే తాగించాలన్నారు. తరువాత కూడా కొనసాగిస్తూ అదనపు ఆహారం పెట్టాలన్నారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా తల్లులు ఆహారం, వంట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం అపర్ణ, అంగన్‌వాడీ టీచర్లు సుహాసిని, జ్యోతి, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

విలువైన పోషకాలతో ఆరోగ్యం పదిలం

దోమ: ఐనాపూర్ గ్రామంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను టీచర్ బాలమణి నిర్వహించగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగణమ్మ హాజరై గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణిలు, బాలింతలు, పిల్లలు పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కుసుమ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు మల్లమ్మ, నిర్మల, పంచాయతీ కార్యదర్శి నరేందర్‌గౌడ్, ఆశవర్కర్లు లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

అనంతగిరి: ఈ నెల 27న వరంగల్‌లో చేపట్టే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వికారాబాద్ పట్టణంలోని కొత్రెపల్లిలో పార్టీ నాయకులతో మాట్లాడారు. వరంగల్ సభకు జిల్లా నుంచి వేలాదిగా తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోపాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

20వరకు పూర్తి చేయాలి

అనంతగిరి: పార్టీ పూర్తి స్థాయి మండల కమిటీలను, గ్రామ కమిటీలను ఈ నెల 20వరకు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా మాజీ అధ్యక్షుడు సంఘటన సంరచన ప్రభారి పడాకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలో వికారాబాద్, పరిగి, తాండూర్ అసెంబ్లీ మండల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ మండలాల్లో బీజేపీ కోసం పనిచేసే వారు ముందుకు వచ్చి మండల కమిటీలలో బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, విజయభాస్కర్, రాష్ట్ర దళితమోర్చా కార్యదర్శి నవీన్‌కుమార్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసానికి స్పందన

దౌల్తాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి మండలంలో విశేష స్పందన వచ్చింది. నిరుద్యోగులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. 1,225 దరఖాస్తుల్లో ఎస్సీ 278, ఎస్టీ 110, బీసీ 757, ఈబీసీ 12, మైనార్టీ 68 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

మొక్కలు ఎండకుండా చూసుకోవాలి


నాగవరం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూసుకోవాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని నాగవరం గ్రామాన్ని సందర్శించి నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి శేఖర్‌తో పాటు ఈజీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వానాకాలం నాటికి నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కలు ఎండకుండా ప్రతిరోజు నీరు పట్టాలన్నారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ కేతావత్ తారాసింగ్


మాట్లాడుతున్న తారాసింగ్

తాండూరు రూరల్: వేసవికాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగొద్దన్నారు. అత్యవసరమనుకుంటేనే బయటకు వెళ్లాలని, గొడుగు, టోపీ, తలపాగ, తెల్లని కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు కూడా ఉదయం పూటే పనులు ముగించుకోవాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో గొర్రెలు, మేకల పెంపకందార్లు, వ్యవసాయ పొలంలో పనిచేసే రైతులు చెట్ల కింద ఉండొద్దని సూచించారు. ఎక్కడైన పిడుగు పడి ఏమైన ప్రమాదం సంభవిస్తే వెంటనే ఈ ఫోన్ నంబర్‌కు 7995061179 సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలుసుకోవాలి


చౌడాపూర్ జెడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: అంబేడ్కర్ జీవితచరిత్ర ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని చౌడాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గసభ్యుడు బంధయ్య పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం పీఠికను విద్యార్థులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేడ్కర్ గురించి ఒక్కోరకంగా చెప్పుకుంటున్నారని, ఆయన నిజజీవితంలో ఎవరి వల్ల ఇబ్బందులకు గురయ్యారు, ఎవరి వల్ల ఆయన మోసపోయారనే విషయాలను తెలుసుకునేందుకు అంబేడ్కర్ జీవితచరిత్ర తెలిపే పుస్తకాలు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, రాజశేఖర్, జనార్దన్, బాలరాజ్, నరేష్, రాము, రఘు, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం అందజేత

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన ఆరెకటిక సంఘం సభ్యులు కటికె అంబాజీ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుడి అంత్యక్రియల నిమిత్తం మండల సంఘం సభ్యులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, బ్రహ్మోజీ, రఘు, బాబుజీ, గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు ఉచిత వైద్య శిబిరం

పరిగి: పట్టణ కేంద్రంలోని కావ్యనర్సింగ్‌హోంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ దేవేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ గురుకుల పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

కొడంగల్: నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. మొదటి విడతలో ఐదో తరగతి కోసం దివ్యశ్రీ, సాయి, అనుదీప్, గౌతమ్, తరుణ్, వరలక్ష్మీ ఎంపికయ్యారు. ఆరో తరగతి కోసం శ్రీవల్లి, వైష్ణవి, వర్షిత్, సందీప్‌గౌడ్, వరుణ్, మనోజ్, శ్రావణ్ ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్వీట్లు తినిపించి అభినందించారు.

◆ నేడు భూ భారతిపై అవగాహన

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిగికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతిపై రైతులకు, అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారని దీనికి మంత్రి హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు పూడూరుకు పొంగులేటి..

పూడూరు: భూ భారతి అవగాహన కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నట్లు తహసీల్దార్ భరత్‌గౌడ్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యత

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి
- శిక్షణ పూర్తి చేసుకున్న 105 మందికి కుట్టు మిషన్ల పంపిణీ


కొడంగల్: కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్: మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొడంగల్, దుద్యాల మండలాలకు చెందిన 105 మంది షెడ్యూల్ కులాల మహిళలు కుట్టు మిషన్లు నేర్చుకున్నారు. పట్టణంలోని కడ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచితంగా కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆధునిక సమాజంలో ప్యాషన్ డిజైనింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆ దిశగా మహిళలు నూతన ఆలోచనలతో వృద్ధి సాధించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల కోసం త్వరలో స్వయం ఉపాధి పథకాలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, దాము, ఆసిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: షెడ్యూల్డ్ కులాల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పడుతుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ పూర్తి చేసుకున్న 35మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు.